ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 150 | పేజీలు: 6 | వెల: రూ.3/- | మంగళవారం 8 సెప్టెంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# స్పీకర్‌పై ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు
# స్పీకర్ కంటతడి

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును
బర్తరఫ్ చేద్దాం రండి: రేవంత్
మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలి
అసెంబ్లీలోభావోద్వేగానికి సీతక్క గుర్రై కంటతడి
దళితులపై కేసీఆర్ అభిమానం లేదు
అసెంబ్లీలో భావోద్వేగానికి సీతక్క కన్నీరు





హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ప్రభాత ఉదయం)

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్టుగా భావిస్తున్న వ్యాఖ్యలు శాసనసభ వేదికగా తీవ్ర దుమారాన్ని రాజేశాయి. సభలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌పై తాతా మధు వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఎమ్మెల్యేల తరఫున స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ తక్షణమే దీనిపై సభకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు కావాలని మాట్లాడారా లేక ఎవరైనా మాట్లాడించారా అని ప్రశ్నించిన ఏలేటి, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించిన సదరు ఎమ్మెల్సీని పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని పట్టుబట్టారు. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సభలో తీవ్రస్థాయిలో మండిపడుతూ, కేసీఆర్ క్షమాపణలు చెప్పాల్సిందేనని, మధుపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌కు జరిగిన తీవ్ర పరాభవంపై మంత్రి సీతక్క అసెంబ్లీలోనే భావోద్వేగానికి గుర్రై కంటతడి పెట్టగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా తీవ్ర మనస్తాపంతో భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకోవడం సభను కుదిపివేసింది.



## అసెంబ్లీ రచ్చ..రచ్చ..

సమావేశాల ప్రారంభానికి ముందు ఉద్రిక్తత
హామీల అమలుపై బీఆర్ఎస్ నేతల నిరసన
నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి నేతలు
అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద హరీశ్‌రావును అరెస్ట్
పోలీసులతో వాగ్వాదంలో కేటీఆర్ కు గాయాలు
తోపులాటలో గాయపడ్డ మహిళా ఎమ్మెల్యేలు

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ప్రభాత ఉదయం)

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు అసెంబ్లీ ముందు ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన, హామీల అమలుపై నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి రావడం అసలు ఘర్షణకు కారణం అయింది. నినాదాలు, ప్లకార్డులతో వచ్చిన బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీలోకి నల్ల టీషర్టులతో వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా హరీశ్‌రావు బ్లాక్ టీషర్ట్ విప్పి బనియన్‌తో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ సహా పలువురు ..మిగతా 2లో




## నా వ్యాఖ్యలు... స్పీకర్‌ను
## ఉద్దేశించినవి కావు

నేను అనని మాటలు నాకు ఆపాదిస్తున్నారు
నా వ్యాఖ్యలు ఇబ్బందికరమైతే ఉపసంహరించుకుంటాను
శాసనసభ ఘటనపై తాతా మధు వివరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ప్రభాత ఉదయం)

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమ వారం చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వివరణ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించి తాను మాట్లాడిన మాటలను తనకు ఆపాదిస్తున్నారని పేర్కొంటూ ఈ విషయంపై తన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక కీలక ప్రకటన చేశారు. శాసనసభలోకి వెళ్లే సమయంలో మహిళా శాసనసభ్యులతో పాటు తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో తోపులాట, ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని ఎమ్మెల్సీ తాతా మధు చెప్పారు. ఈ క్రమంలో తనపై కూడా దాడి జరిగిందని, తన షర్టు, ఫ్యాంటు లాగేందుకు, గొంతు నొక్కేందుకు ప్రయత్నించినట్లు అనిపించిందని పేర్కొన్నారు. కొంతమంది తనను దుర్భాషలాడినట్లు పేర్కొన్నారు. ఈ పరిణామాలతో తీవ్ర ఆవేదనకు గురై.. తనపై దాడి చేసింది ఎవరు తన షర్టు లాగేందుకు ఎవరు ప్రయత్నించారు అలా చేయమని ఎవరు ఆదేశించారు అంటూ తాను ప్రశ్నించినట్లు తాతా మధు వివరించారు. అయితే ఈ వ్యాఖ్యలను స్పీకర్‌ను ..మిగతా 2లో

## ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు



నిబంధనలు ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు
రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు




## తెలంగాణలో 'సర్' గడువు
## మరోసారి పొడిగింపు

అక్టోబర్ 7 వరకు పొడిగిస్తూ ఈసి నిర్ణయం
నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ప్రభాత ఉదయం)

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం ..మిగతా 2లో

## కొడంగల్‌లో 81 వేల ఓట్లు గల్లంతు

కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర... బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా
పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర.. దీనిపై లౌకిక శక్తులు ఏకం కావాలి
సర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ప్రభాత ఉదయం)

తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని



లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

## తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గద్వాల విజయలక్ష్మి

మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఆకుల నరేందర్ ముదిరాజ్



కూకట్ పల్లి, సెప్టెంబర్ 7 (ప్రభాత ఉదయం)

తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా మాజీ హైదరాబాద్ మేయర్, తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి సోమవారం ప్రగతి భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం గద్వాల విజయలక్ష్మిని మేడ్చల్ జిల్లా మత్స్యకారుల కమిటీ వైస్ చైర్మన్, బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆకుల నరేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్‌గా విజయలక్ష్మికి కీలక బాధ్యతలు దక్కడం సంతోషకరమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సమగ్ర ప్రణాళిక రూపకల్పనలో ఆమె తన అనుభవాన్ని ఉపయోగించి మరింత సమర్థవంతంగా పనిచేస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజా సేవలో ఇప్పటికే మేయర్‌గా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా సేవలందించిన విజయలక్ష్మికి తాజాగా మరో కీలక బాధ్యత లభించడం పట్ల ముదిరాజ్ సంఘం నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# నడిపిన సభలోనే.. నిలిచిన పేరు

## శాసనసభకు శ్రీపాద గౌరవం... సెంట్రల్ హాల్‌కు మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు







కొన్ని పేర్లు చరిత్రలో నిలిచిపోతాయి.. మరికొన్ని పేర్లే చరిత్రకు గౌరవం తెస్తాయి. మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు అలాంటి అరుదైన ప్రజానాయకుడు. ప్రజల కష్టాలను తనవిగా భావించి శాసనసభలో గళమెత్తిన ఆయన.. సభా నిబంధనలను ఆయుధంగా, ప్రజాస్వామ్యాన్ని బాధ్యతగా భావించి స్పీకర్ పదవికి ప్రత్యేక గౌరవం తెచ్చారు. ఒకప్పుడు తన నిష్పాక్షిక నిర్ణయాలతో సభను నడిపించిన ఆ నాయకుడి పేరు ప్రభుత్వం ఇప్పుడు అదే శాసనసభలోని నూతన సెంట్రల్ హాల్‌కు పెట్టడం ఆయన ప్రజా జీవితానికి లభించిన చారిత్రక గౌరవంగా నిలిచింది. అసెంబ్లీలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఐటి పరిశ్రమలు

శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఇతర మంత్రులతో కలిసి సోమవారం "దుద్దిళ్ల శ్రీపాదరావు సెంట్రల్ హాల్" ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

ఇది ఒక హాల్‌కు పేరు పెట్టిన కార్యక్రమం మాత్రమే కాదు.. ప్రజల కోసం పలికిన గొంతుకు, ప్రజాస్వామ్య విలువలను కాపాడిన వ్యక్తిత్వానికి, శాసనసభా సంప్రదాయాలను గౌరవించిన నాయకత్వానికి లభించిన శాశ్వత గుర్తింపు. ఒకప్పుడు స్పీకర్ కుర్చీలో కూర్చొని సభను నడిపించిన శ్రీపాదరావు.. ఇప్పుడు అదే సభలోని సెంట్రల్ హాల్ ద్వారా ప్రతి రోజూ గుర్తుకు రానున్నారు.

### ప్రజల మధ్య పుట్టిన ప్రజా నాయకత్వం

1937 నవంబర్ 6న దుద్దిళ్ల రాధాకృష్ణయ్య, కమలాభాయి దంపతులకు జన్మించిన శ్రీపాదరావు బి.ఎస్సీ, ఎల్.ఎల్.బి విద్యను అభ్యసించారు. స్వగ్రామం ధన్వాడ నుంచే ప్రజాసేవకు శ్రీకారం చుట్టారు. వరుసగా మూడుసార్లు ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికై గ్రామ ప్రజల నమ్మకాన్ని పొందారు. గ్రామస్థాయి నుంచి ప్రారంభమైన ఆయన ప్రజా ప్రస్థానం.. మంథని భూతనఖా బ్యాంక్ చైర్మన్, మహాదేవ్‌పూర్ సమితి ఉపాధ్యక్షుడి వరకు సాగింది. ప్రజల మధ్య పనిచేసిన అనుభవం.. వారి కష్టాలను దగ్గరగా చూసిన అనుభూతి.. తర్వాతి రాజకీయ జీవితానికి బలమైన పునాదిగా మారాయి.

### మంథని నుంచి శాసనసభకు..

1983లో తొలిసారి మంథని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన శ్రీపాదరావు.. 1984, 1989 ఎన్నికల్లోనూ వరుస విజయాలు సాధించారు. కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ విప్‌గా, రీజినల్ టొబాకో బోర్డు సభ్యుడిగా, పలు శాసనసభా కమిటీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు.

ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తన నియోజకవర్గ సమస్యలతో పాటు ఉత్తర తెలంగాణ ప్రాంత ప్రజల ఇబ్బందులను శాసనసభలో ప్రస్తావించారు. పదవులు ఆయన రాజకీయ జీవితాన్ని పరిచయం చేస్తే.. ప్రజల కోసం ఆయన పలికిన మాటలు ఆయన వ్యక్తిత్వాన్ని పరిచయం చేస్తాయి.

### స్పీకర్ కుర్చీకి కొత్త గౌరవం..

1991 ఆగస్టు 19న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా శ్రీపాదరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1995 జనవరి 11 వరకు ఆ పదవిలో కొనసాగారు. స్పీకర్ కుర్చీని ఆయన అధికారానికి ప్రతీకగా చూడలేదు. అది ప్రజాస్వామ్యానికి అప్పగించిన బాధ్యతగా భావించారు. సభా నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఆయన రూల్‌బుక్‌ను తన నిర్ణయాలకు ప్రాతిపదికగా చేసుకున్నారు.

అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా సభా నియమాలకు ప్రాధాన్యం ఇచ్చారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్, రూలింగ్స్ విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు శాసనసభా వ్యవహారాల్లో ప్రత్యేక ముద్ర వేశాయి. ప్రతిపక్ష సభ్యుల హక్కులను గౌరవిస్తూ.. సభా గౌరవాన్ని కాపాడుతూ వ్యవహరించిన నిష్పాక్షిక స్పీకర్‌గా ఆయన పేరు నిలిచిపోయింది.

### ప్రజల గుండె చప్పుడు.. శ్రీపాద వాణి

శ్రీపాదరావు శాసనసభలో మాట్లాడినప్పుడు ఆయన ముందున్నది రాజకీయ ప్రత్యర్థి కాదు.. ప్రజల సమస్య.

గోదావరి పరివాహక ప్రాంత రైతుల సాగునీటి సమస్యలు, ఉత్తర తెలంగాణ కరువు పరిస్థితులు, దళిత--బహుజన, పేద వర్గాల ఆవేదన, నిరుద్యోగం, నక్సలైట్ సమస్య వంటి అనేక అంశాలను ఆయన సభ ముందుంచారు. ఆయన ప్రసంగాల్లో ఆవేశం ఉండేది.. కానీ ఆ ఆవేశానికి వెనుక అధ్యయనం ఉండేది. ప్రశ్నించడంలో పదును ఉండేది.. కానీ ఆ ప్రశ్న వెనుక ప్రజా ప్రయోజనం ఉండేది. అందుకే ఆయన ప్రసంగాలు కేవలం రాజకీయ ప్రసంగాలుగా కాకుండా.. ఆ కాలం ప్రజల జీవన సమస్యలకు అద్దం పట్టిన శాసనసభా దస్తావేజులుగా నిలిచాయి.

### అక్షర రూపంలో 'ప్రజల పక్షాన శ్రీపాద వాణి'

శ్రీపాదరావు శాసనసభా ప్రసంగాలు ఇప్పుడు 'ప్రజల పక్షాన శ్రీపాద వాణి' పేరుతో గ్రంథరూపంలోకి వస్తున్నాయి. ఎమెస్కో ప్రచురణగా రూపొందుతున్న ఈ సంకలనం ఆయన శాసనసభా ఆలోచనలు, ప్రజా సమస్యలపై ఆయన దృక్పథం, సభా వ్యవహారాలపై ఆయనకున్న పట్టు వంటి అంశాలను భవిష్యత్ తరాలకు అందించనుంది. మైకు దొరికిన వెంటనే ఎంత గట్టిగా మాట్లాడామన్నది కాదు.. మాట వెనుక ఎంత విషయ పరిజ్ఞానం, ఎంత ప్రజా ప్రయోజనం ఉందన్నదే ముఖ్యమని ఆయన ప్రసంగాలు నేటి తరానికి చెబుతున్నాయి.

### అర్ధరాత్రి తలుపు తట్టినా..

ప్రజా జీవితంలో ఎంతటి ఉన్నత పదవులు చేపట్టినా.. సామాన్యుడికి దూరం కాకపోవడం శ్రీపాదరావు ప్రత్యేకత. "అర్ధరాత్రి తలుపు కొట్టినా స్పందించే నాయకుడు" అన్న విశ్వాసం ఆయనకు ప్రజల్లో ఉండేది. మంథనితో ఆయనకున్న అనుబంధం కేవలం రాజకీయ సంబంధం కాదు.. ఆత్మీయ బంధం. సతీమణి జయశ్రీ,

నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలతో కూడిన కుటుంబంలో మంథనితో ఉన్న ఆత్మీయ బంధాన్ని చివరివరకు శ్రీపాదరావు వీడలేదు

1999 ఏప్రిల్ 13న 62 వ ఏట నక్సలైట్ల చేతిలో ఆయన హత్యకు గురయ్యారు. జీవితం అర్ధాంతరంగా ముగిసినా.. ప్రజలతో ఆయనకున్న అనుబంధం, ప్రజాస్వామ్యంపై ఆయనకున్న నిబద్ధత, శాసనసభలో ఆయన వేసిన ముద్ర మాత్రం కాలంతో చెరిగిపోలేదు.

### తండ్రీ బాటలో తనయుడు..

దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు చూపిన ప్రజాసేవా బాటలోనే మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముందుకు సాగుతున్నారు. శ్రీధర్ బాబు ప్రస్తుతం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన పదవి మాత్రమే కాదు.. ప్రజల పట్ల నిబద్ధత, సౌమ్యమైన వ్యవహారశైలి, విషయ పరిజ్ఞానంతో కూడిన నాయకత్వాన్ని తన రాజకీయ ప్రస్థానంలో కొనసాగిస్తున్నారు.

శ్రీపాదరావు ప్రజల సమస్యలను శాసనసభలో బలంగా వినిపించినట్లే.. శ్రీధర్‌బాబు కూడా ప్రజా సమస్యలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి, పాలనలో తనదైన ముద్ర వేస్తున్నారు. తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చిన శ్రీధర్‌బాబు.. 'తండ్రికి తగ్గ తనయుడు' అనే గుర్తింపును నిలబెట్టుకుంటున్నారు.

### పేరు పెట్టింది హాల్‌కు.. నిలిచింది ఓ విలువ

ఇప్పుడు తెలంగాణ శాసనసభలోని నూతన సెంట్రల్ హాల్‌కు దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టడం ఆయన సేవలకు లభించిన అపూర్వ గౌరవం.

శాసనసభను నడిపించిన వ్యక్తి పేరు.. అదే శాసనసభలోని కీలక ప్రాంగణానికి చిరునామా కావడం అరుదైన సందర్భం.

ఇది కేవలం పేరు కాదు..
ప్రజల గొంతుకకు గౌరవం.
నిష్పాక్షికతకు గౌరవం.
శాసనసభా సంప్రదాయాలకు గౌరవం.
ప్రజాస్వామ్య విలువలకు గౌరవం.
ఒకప్పుడు స్పీకర్‌గా సభను నడిపించారు..
ఇప్పుడు అదే సభలో ఓ ప్రాంగణంగా నిలిచారు.
మాటలతో ప్రజల మనసుల్లో నిలిచిన శ్రీపాదరావు..
ఇప్పుడు తన పేరుతో శాసనసభలో శాశ్వతంగా నిలిచారు.

**నడిపిన సభలోనే.. నిలిచిన పేరు**
**శాసనసభకు శ్రీపాద గౌరవం.**



గొట్టిముక్కుల బ్రహ్మచారి
సీనియర్ జర్నలిస్టు, 9441884389

# నా వ్యాఖ్యలు... స్పీకర్‌ను ఉద్దేశించినవి కావు

మొదటి పేజీ తరువాయి...

ఉద్దేశించి చేసినవిగా భావించడం సరికాదని స్పష్టం చేశారు.స్పీకర్ వ్యవస్థ పట్ల, వ్యక్తిగతంగా స్పీకర్ పట్ల తనకు ఎంతో గౌరవం ఉందని తాతా మధు తెలిపారు. స్పీకర్‌ను ఉద్దేశించి తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఒకవేళ తన వ్యాఖ్యల్లో ఏదైనా స్పీకర్‌ను ఉద్దేశించినట్లు భావిస్తే.. ఆ మాటలను ఉపసంహరించుకుంటున్నానని, అందుకు విచారం వ్యక్తం చేస్తున్నానని పేర్కొన్నారు. శాసనసభలోకి వెళ్లే సమయంలో తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యంగా మహిళా శాసనసభ్యులతో పోలీసులు వ్యవహరించిన తీరుపై తాతా మధు ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా శాసనసభ్యులతో తోపులాట జరిగిందని, వారి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తమ సీనియర్ నాయకులను పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లారని ఆయన తెలిపారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులతో వ్యవహరించే విషయంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.శాసనసభ్యులపై జరిగినట్లు పేర్కొన్న పరిణామాలపై ప్రభుత్వం స్పందించాలని తాతా మధు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను మాట్లాడిన వ్యాఖ్యలపై ఏర్పడిన వివాదం కంటే శాసనసభలో చోటుచేసుకున్న అసలు పరిణామాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తాతా మధు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల పట్ల జరిగిన ఘటనలపై సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.శాసనసభలో చోటుచేసుకున్న పరిణామాలపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. తాతా మధు ఇచ్చిన తాజా వివరణ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# తెలంగాణలో 'సర్' గడువు మరోసారి పొడిగింపు

మొదటి పేజీ తరువాయి...

కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దు కోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

# ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు


**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# అసెంబ్లీ రచ్చ..రచ్చ..

మొదటి పేజీ తరువాయి...

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఇదే విధంగా టీషర్టులు విప్పి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద హరీశ్‌రావును అరెస్ట్ చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే నల్ల టీషర్ట్ ధరించి అసెంబ్లీకి రావడంపై పోలీసులు అభ్యంతరం చెప్పడాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాహుల్ గాంధీ టీషర్ట్ ధరించి పార్లమెంట్‌కు వెళ్తే తప్పు లేనప్పుడు.. తాము నల్ల టీషర్టులు వేసుకుని నిరసన తెలపడం ఎందుకు తప్పని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తమ నిరసనను అడ్డుకుంటోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఇక.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్.. పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోలీసులు డ్యూటీ చేయండి, కానీ అతి చేయకండి అంటూ వ్యాఖ్యలు చేశారు. 2 ఏళ్లలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని.. వార్నింగ్ ఇచ్చారు. పోలీసులతో వాగ్వాదంలో తనకు అయిన గాయాలను.. మీడియాకు కేటీఆర్ చూపించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. మరోవైపు.. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తమతో అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. తన చీర పట్టుకుని లాగేశారని.. బూటు కాళ్లతో తొక్కారని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల కూడా పోలీసులు తీరును మార్చుకోవాలని ఆమె మండిపడ్డారు. మరోవైపు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద అస్వస్థతకు గురై కిందపడిపోయారు.



# ప్రజావాణికి 56 ఫిర్యాదులు

## ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**ప్రజావాణిలో మొత్తం 56 ఫిర్యాదుల స్వీకరణ**

**రెవెన్యూ శాఖకు 27, ఇతర శాఖలకు 29 వినతులు**

**అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి**

**ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్7(ప్రభాత ఉదయం)**

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 56 ఫిర్యాదులు అందాయి.ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందుతున్న ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజలకు సత్వర సేవలు అందించాలని తెలిపారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 27, ఇతర శాఖలకు సంబంధించిన 29, మొత్తం 56 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు.ప్రజావాణి అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన "మట్టి గణపతిని పూజిద్దాం -- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణహితంగా వేడుకలను నిర్వహించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (ాశీా) విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని, సహజసిద్ధమైన రంగులు, పర్యావరణహిత అలంకరణలను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు సంబంధిత శాఖలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

**శేరిలింగంపల్లి ,సెప్టెంబర్ 7,( ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి జ్యోతి ప్రదీపనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధిపతి ఆచార్య పిల్లలమర్రి రాములు విచ్చేసి మండల పరిధిలో గల ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, గురుకుల కళాశాలల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత ప్రాథమిక పాఠశాలలలో పనిచేస్తున్న 35 మంది అధ్యాపకులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను వేదమంత్రాల నడుమ సాంప్రదాయ బద్ధంగా ప్రదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం బిల్డర్ సోషల్ వర్కర్ తూనిక రాఘవేంద్రరావు, యూవీ రమణమూర్తి సౌజన్యంతో నిర్వహించడం జరిగింది.



తదనంతరం ఆచార్య పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ సమాజంలో అత్యంత గౌరవప్రదమైన వృత్తి అధ్యాపక వృత్తి అని అన్నారు. అందుకే జన్మనిచ్చిన తల్లిదండ్రుల తరవాతి స్థానం గురువుదే అని పేర్కొన్నారు. గురువు తన శిష్యులలో చీకటి అనే అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానమనే జ్యోతిని వెలిగించి వారి ఉజ్వల భవిష్యత్తుకై నిరంతరం శ్రమిస్తుంటారు. మనిషి జీవించడానికి గాలి, నీరు, ఆహారం ఎంత అవసరమో విద్య కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. దేశం అభివృద్ధి పథంలో పయనించడానికి ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడటానికి విద్యయే ప్రధాన కారణం. సమాజంలో వివిధ రంగాలలో ఉన్న ప్రముఖులందరూ కూడా గురువు అడుగుజాడలలో నడిచిన వారే. కేవలం పాఠ్య పుస్తకాలలోని పాఠాలే కాకుండా క్రమశిక్షణ, మానవతా, నైతిక విలువలు పెంపొందించడం, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించి వారి సర్వతోముఖాభివృద్ధికి గురువు నిరంతరం పాటు పడతాడని చెప్పారు. ప్రతి సంవత్సరం మన దేశంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటాము. సెప్టెంబరు 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదినం. రాధాకృష్ణన్ రాజకీయ వేత్త, తత్వవేత్త, గొప్ప రాజనీతిజ్ఞుడు, రచయిత విద్యావేత్త అని కొనియాడారు. రాధాకృష్ణన్ ఈ సమాజానికి ఉపన్యాసకుడిగా, ఆచార్యునిగా, ఉప కులపతిగా ఆక్స్ ఫర్డ్ వంటి ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయాలలో తత్వశాస్త్ర బోధకునిగా రష్యాలో భారత రాయబారిగా, రాజ్యాంగ పరిషత్ సభ్యునిగా, యునెస్కో అధ్యక్షునిగా యూఈసీ చైర్మన్ గా, ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా సమాజానికి విశేషమైన సేవలు అందించినందుకు ఆయనను భారతరత్న బ్రిటిష్ రాయల్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ వంటి అవార్డులు వరించాయ అని తెలిపారు. ఆయన భారతీయ తాత్విక చింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశపెట్టారని గౌరవార్థం ఆయన జన్మదినమైన సెప్టెంబరు 5న భారత ప్రభుత్వం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తూ ఉందని వివరించారు. నేటి యువ రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నూతన విద్యా విధానంలో వస్తున్నటువంటి మార్పులను క్షుణ్ణంగా అధ్యాయనం చేసి, ఆకళింపు చేసుకొని, సమాజంలో క్షేత్రస్థాయిలో వస్తున్న మార్పులను నిశితంగా గమనిస్తూ నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థిని విద్యార్థులకు విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందించి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసే సామాజిక బాధ్యత అధ్యాపకులదేనని భారతీయ సనాతన విధానంలో గురుశిష్య బంధంలోని నైతికతను పరంపరాగతంగా కాపాడుకుంటూ రావాలని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్రరెడ్డి, మండల విద్యాధికారి వెంకటయ్య, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బసవలింగం, అధ్యాపకులు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, వాణి సాంబశివరావు, ఉమా చంద్రశేఖర్, జీవీ రావు, బాలన్న, సుజాత, వీణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ మన్నా చర్చిలో రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ జ్ఞాపకార్థ కూడిక



సమావేశంలో మాట్లాడుతున్న బిషప్ రేచల్ జ్యోతి కొమానపల్లి



బిషప్ బి ఎస్ మోజెస్ కుమార్



మాట్లాడుతున్న కుటుంబ సభ్యులు



సమావేశంలో పాల్గొన్న కుటుంబ సభ్యులు, బంధువులతో బిషప్ రేచల్ జ్యోతి కొమానపల్లి

**బుద్వేల్, సెప్టెంబరు 7 (ప్రభాత ఉదయం)**

రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ ప్రేమ కలిగిన వ్యక్తి అని మన్నా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు బిషప్ రేచల్ జ్యోతి కొమానపల్లి అన్నారు. రాజేంద్రనగర్ మన్నా ఫుల్ గాస్పెల్ చర్చ్ పాస్టర్ గా సేవలందిస్తు.. ఇటీవల దేవునిలో నిద్రించిన రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ జ్ఞాపకార్థ కూడిక సోమవారం మన్నా చర్చిలో జరిగింది. రెవరెండ్ జాన్ మోజెస్ సతీమణి సిస్టర్ సీహెచ్ ప్రభావతి, కుమారులు జాన్ సామ్యూల్, జాన్ సుందర్ పాల్ ల ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రార్థన సమావేశానికి మన్నా మినిస్ట్రీస్ తెలంగాణ రీజినల్ వైస్ ప్రెసెడింట్ రెవరెండ్ సీహెచ్ భాస్కర్ రావు అధ్యక్షత వహించారు. పూర్వం మంచిగా సేవ జరిగి 26 సంవత్సరాల క్రితం శిథిలమైన స్థితిలో ఉన్న చర్చి పరిస్థితులను బాగు చేయడానికి మన్నా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ ఎర్నెస్ట్ పాల్ కొమానపల్లి ద్వారా రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ ను రాజేంద్రనగర్ కు పంపించడం జరిగిందన్నారు. రాజేంద్రనగర్ లో రెవరెండ్ జాన్ మోజెస్ అద్భుతమైన సేవ జరిగించారని గుర్తు చేసుకున్నారు. నాయకత్వం అన్నా, దేవుని సేవ అన్నా ఆయనకు ఎనలేని ఇష్టం అని గుర్తు చేసుకున్నారు. నమ్మకమైన దేవుని సేవకుడని, ప్రేమించే మనస్సున్న వారని రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ గురించి గుర్తు చేసుకున్నారు. జ్ఞాపకార్థ కూడిక లో పాల్గొన్న రాక్ చర్చి సీనియర్ పాస్టర్ సిస్టర్ పి విజయ దీవెన్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ సతీమణి సిస్టర్ సీహెచ్ ప్రభావతి, కుమారులు జాన్ సామ్యూల్, జాన్ సుందర్ పాల్ లకు ఆదరణ కలిగించే మాటలు తెలియజేశారు. వారి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ లో దేవుని సేవ మరింత గొప్పగా జరుగుతుం దని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో పాల్గొన్న ఇంటర్నేషనల్ పెంతకోస్టల్ హోలినెస్ చర్చ్ ప్రిసైండింగ్ బిషప్ డాక్టర్ బి.ఎస్ మోజెస్ కుమార్ మాట్లాడుతూ, రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ దేవుని లో నిద్రించి పరలోక రాజ్యంలో ఆయన దేవుని సన్నిదిలో ఉన్నారన్నారు. ఆయనను జ్ఞాపకం చేసుకుంటు ఏర్పాటు చేసిన సమావేశంలో మనమందరం దేవుణ్ణి స్థుతించడానికి అవకాశం కలిగిందన్నారు. విడిచి వెళ్లిన కుటుంబానికి దేవుడే అండగా ఉంటారని ప్రార్థన చేశారు. కుటుంబాన్ని ధైర్య పరుస్తు సిస్టర్ సీహెచ్ ప్రభావతి కి దేవుని ఆదరణ ఎలా ఉంటుందో తెలియజేసే తాను రాసిన పుస్తకాన్ని బహుమతిగా అందజేశారు. జ్ఞాపకార్థ కూడిక సందర్భంగా కుటుంబ సభ్యులు జాన్ సామ్యూల్, జాన్ సుందర్ పాల్, సిస్టర్ కృపాకుమారి, గ్లాడీ ప్రేంసన్, డానీ ప్రేంసన్ లతో పాటు చర్చి సభ్యులు రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సమావేశంలో మన్నా మినిస్ట్రీస్ రీజినల్ వైస్ప్రెసిడెంట్ రెవరెండ్ పీఎస్ డేవిడ్, నాయకులు రెవరెండ్ సంజీవ, రెవరెండ్ దేవానంద్, విజయనగరానికి చెందిన రెవరెండ్ డాక్టర్ ప్రేమానందం, రాజేంద్రనగర్ నియోజకవర్గం పాస్టర్స్ ఫెలోషిప్ అద్యక్షులు రెవరెండ్ డాక్టర్ కె నతానియేల్, రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, కోశాధికారి పాస్టర్ బట్టు శ్రీకాంత్ లతో పాటు మన్నా మినిస్ట్రీస్ కు చెందిన పాస్టర్లు, రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ కు చెందిన పాస్టర్లు, రాజేంద్రనగర్ పాస్ట రమ్మల ఫెలోషిప్ కు చెందిన పాస్టరమ్మ లు, మన్నా చర్చ్ విశ్వాసులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అసెంబ్లీ ముట్టడికి రాజేంద్రనగర్ బీజేపీ శ్రేణుల తరలింపు..

**పోలీసుల అడ్డంకులను దాటుకుని అసెంబ్లీ గేటు వరకు చేరిక నాయకుల అరెస్ట్..**

**ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలింపు..**

**రూ.15వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్**

**రాజేంద్రనగర్,సెప్టెంబర్07(ప్రభాత ఉదయం)**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం ఉదయం11గంటలకు నిర్వహించిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి రాజేంద్రనగర్ డివిజన్ నుంచి బీజేపీ నాయకులు,కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తు అరెస్టులు,గృహ నిర్బంధాలు చేపట్టి శతవిధాలుగా ప్రయత్నించినప్పటికీ బీజేపీ నాయకులు వెనక్కి తగ్గకుండా అసెంబ్లీ వైపు తరలివెళ్లారు.పోలీసుల ఆంక్షలు,అడ్డంకులను అధిగమించి రాజేంద్రనగర్ డివిజన్ నాయకులు చివరకు అసెంబ్లీ ప్రధాన గేటు వరకు చేరుకున్నారు.అక్కడ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.తెలంగాణలో విద్యార్థులకు సంబంధించిన రూ.15వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.బకాయిలు విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని సుమారు 40లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఆరోపించారు.పేద,మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎంతో కీలకమని,బకాయిల విడుదలలో జాప్యం కారణంగా విద్యార్థులు,కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.విద్యార్థుల హక్కుల సాధన కోసం ధర్నాచౌక్‌లో విద్యార్థి మహాధర్నాకు పిలుపునిస్తే ప్రభుత్వం భయంతో అనుమతి నిరాకరించిందని బీజేపీ నాయకులు విమర్శించారు.విద్యార్థుల సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.విద్యార్థుల హక్కుల కోసం మరింత పెద్దఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ప్రభుత్వానికి ప్రజలు,విద్యార్థులు తగిన సమాధానం చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్‌ముదిరాజ్,మాజీ అధ్యక్షుడు బాబురావు,ఓబీసీ జిల్లా కార్యదర్శి హరికిషన్,జిల్లా కౌన్సిల్ సభ్యుడు బండారి బాలకృష్ణ,యువమోర్చా నాయకుడు రాకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దులగుట్ట జాతరలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకం..వైభవంగా 71వ బ్రహ్మోత్సవాలు..**

**శంషాబాద్,సెప్టెంబర్07(ప్రభాత ఉదయం)**



శంషాబాద్‌లోని ప్రసిద్ధ సిద్దులగుట్ట శ్రీవెండికొండ సిద్ధేశ్వర స్వామివారి 71వబ్రహ్మోత్సవాలు, సిద్దులగుట్ట జాతర అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. పవిత్ర శ్రావణ మాస ఆఖరి సోమవారం సందర్భంగా నిర్వహించిన జాతర వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సిద్దులగుట్ట దేవస్థానానికి చేరుకున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి అభిషేకం,ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.అనంతరం ఆలయ పూజారులు ఎమ్మెల్యేకు స్వామివారి ఆశీస్సులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ...పవిత్ర శ్రావణ మాస ఆఖరి సోమవారం సందర్భంగా వెండికొండ సిద్ధేశ్వర స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,పెద్ద సంఖ్యలో శివభక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.సిద్దులగుట్ట బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది.భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజలు,అభిషేకాలతో జాతర వైభవంగా కొనసాగింది.



## సబితా ఇంద్రారెడ్డిపై పోలీసుల తీరును ఖండించిన బీఆర్ఎస్..

**ప్రజాప్రతినిధి పట్ల పోలీసుల వ్యవహారశైలి ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు..**

**అక్రమ అరెస్టులను వెంటనే ఉపసంహరించుకోవాలి**

**రాజేంద్రనగర్,సెప్టెంబర్07(ప్రభాత ఉదయం)**

శాసనసభ ప్రాంగణంలో మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర దిగ్భ్రాంతికరంగా ఉందని అత్తాపూర్,రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త కోలన్ సుభాష్‌రెడ్డితో పాటు డివిజన్ అధ్యక్షుడు పి.ధర్మారెడ్డి, మాజీ కౌన్సిలర్,కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్,నరేందర్,లు తదితరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కోలన్ సుభాష్‌రెడ్డి మాట్లాడు తూ... సీనియర్ మహిళా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లడం అత్యంత దారుణమని ఆరోపించారు.మహిళా సంక్షేమం గురించి గొప్పగా చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా ప్రజాప్రతినిధికి ఇస్తున్న గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు.రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏ స్థాయికి దిగజారాయో ఈ ఘటన నిదర్శనమని విమర్శించారు.ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష నాయకులపై దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు.ప్రజలంతా ప్రభుత్వ తీరును గమనిస్తున్నారని,కాంగ్రెస్ పార్టీ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని తీవ్రస్థాయిలో విమర్శించారు.సబితా ఇంద్రారెడ్డిపై జరిగిన ఘటనను ఖండిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని కూడా నాయకులు తీవ్రంగా ఖండించారు.అధికార మదంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని మండిపడ్డారు.అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కు ఉందని,ప్రజల సమస్యలపై ప్రశ్నించే నాయకులపై అణచివేత చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.ప్రభుత్వం,పోలీసులు తమ వైఖరిని మార్చుకుని ప్రతిపక్ష నాయకులు,కార్యకర్తల హక్కులను గౌరవించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి,ఎర్రోళ్ల యాదయ్య,సదాల వెంకట్ రెడ్డి, సులేమాన్ నగర్ డివిజన్ అధ్యక్షుడు మమ్మద్ జరుద్దీన్,శాస్త్రీపురం అధ్యక్షుడు ముక్రంఖాన్ పోయిల జీవన్‌దాస్,ఎడ్లకాడి సూర్యం,రమేష్ ముదిరాజ్,సరికొండ దుర్గేష్, సింహాద్రి,సునీల్,మల్లేష్, నేతవెంకట్‌రెడ్డి,ఆనంద్‌రెడ్డి,నయీమ్ భాయ్,శివ ముదిరాజ్,రామస్వామి,రిషి,మోహన్,సుగుణ తదితర బీఆర్ఎస్,నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అసెంబ్లీ ముట్టడిని అడ్డుకునేందుకు ముందస్తు అరెస్టులు

**ఇంటికి వచ్చి అదుపులోకి తీసుకున్న పోలీసులు..**

**ప్రజాస్వామ్య ఉద్యమాలను అరెస్టులతో అడ్డుకోలేరని వై.శ్రీధర్ ఆగ్రహం..**

**రాజేంద్రనగర్,సెప్టెంబర్07(ప్రభాత ఉదయం)**



అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనకుండా అడ్డుకునేందుకు రాజేంద్రనగర్ పోలీసులు ముందస్తు అరెస్టులకు పాల్పడ్డారని బీజేపీ నాయకుడు,గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ ఆరోపించారు .సోమవారం ఉదయం సుమారు 7గంటల సమయంలో పోలీసులు తన ఇంటికి వచ్చి ముందస్తుగా అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారని తెలిపారు.ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చేపడుతున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకునే విధంగా ప్రభుత్వం ముందస్తు అరెస్టులకు పాల్పడటం సరికాదని అన్నారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అరెస్టులు,నిర్బంధాలతో నిలువరించలేరని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్య ఉద్యమాలను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ప్రజల్లో మరింత వ్యతిరేకతను మూటగట్టుకుంటుందని విమర్శించారు.ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలీసులు తనను అదుపులో ఉంచారని వై.శ్రీధర్ తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా పోరాడుతున్న నాయకులు,కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రభుత్వ భయాన్ని బయటపెడుతోందని అన్నారు.విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపడుతున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకోవడం ద్వారా సమస్య పరిష్కారం కాదని పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రజల సమస్యలపై దృష్టి సారించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు.ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడానికి ప్రయత్నిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వై.శ్రీధర్ హెచ్చరించారు.అరెస్టులు,నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని,ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అరెస్ట్ అయిన వారిలో రాజేంద్రనగర్ డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఈ.వేణు గోపాల్,లు ఉన్నారు.



మట్టి వినాయకులను నెలకొల్పు కోవాలని పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి




ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

## బీజేపీ నాయకుల అరెస్ట్‌లు

**బుద్వేల్, సెప్టెంబరు 7 (ప్రభాత ఉదయం)**

బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు ఇచ్చిన ఫిలుపు మేరకు చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళుతున్న రాజేంద్రనగర్ సర్కిల్ కు చెందిన అనేకమంది ఆ పార్టీ నాయకులు ముందస్తు అరెస్ట్ లు చేశారు. బీజేపీ గోషా మహాల్, గోల్కొండ జిల్లా కన్వీనర్ గా ఉన్న వై.శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ ఎస్సీ సెల్ ప్రధాన కారదర్శి ఇ వేణుగోపాల్ లను వారి వారి ఇళ్ళ వద్దనే అరెస్ట్ చేసి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అసెంబ్లీ వరకు వెళ్లిన రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు పసుపుల సందీప్ ముదిరాజ్, ఆ పార్టీ సీనియర్ నాయకులు జి బాబురావు, హరికిషన్ జీ, బండారి బాలక్రిష్ణ, రాకేశ్ గౌడ్ లను అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.



రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ లో బీ ఆర్ ఎస్ నాయకులు

## మహిళా ఎమ్మెల్యేలను కించపరచడం సరికాదు: బీఆర్ఎస్ నాయకులు

**బుద్వేల్, సెప్టెంబరు 7 (ప్రభాత ఉదయం)**

శాసన సభ కు వెళుతున్న బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే ల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ఖండిస్తు బీఆర్ఎస్ రాజేంద్రనగర్ సర్కిల్ నాయకులు సోమవారం పీడీపీ చౌరస్తా లో నిరసనకు దిగారు. బీఆర్ఎస్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, పొరెడ్డి ధర్మారెడ్డి, డి రమేశ్ ముదిరాజ్, ఎస్ వెంకటేశ్, ఎర్రోళ్ల యాదయ్య, సరికొండ దుర్గేశ్ ఆధ్వర్యంలో ఈ నిరసన కొనసాగింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాధాలు చేస్తు నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో ఎడ్లకాడి సూర్యం, తదితరులు ఉన్నారు. మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుంట వారి పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులు తీరు ఏమి బాగులేదని జనహిత స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షురాలు కె ఉమా మమూశ్వరీ రెడ్డి ఓ ప్రకటన లో తెలి పారు.




## రాజేంద్రనగర్‌లో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

**బుద్వేల్, సెప్టెంబరు 7 (ప్రభాత ఉదయం)**

మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందిం చడానికి రాజేంద్రనగర్ లో కుట్టు శిక్షణ ఇస్తున్నామని స్నేహంజలి వెల్ఫేర్ అకాడమీ నిర్వాహకురాలు పచ్చ అనిత తెలిపారు. స్నేహాంజలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ శ్రీ వెంకటేశ్వర మహిళా మం డలి సహకారంతో నెల రోజుల పాటు నిర్వహించనున్న ఉచిత కుట్టు శిక్షణ తరగతులను సోమవారం ఆమె పరిశీలించారు. రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి సహకారంతో ముం దుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర మహిళా మండలి అధ్యక్షులు దుంబాల ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ, నెల రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి మద్యాహ్నం 2 గంటల వరకు కుట్టు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఈ కుట్టు శిక్షణ కేంద్రాన్ని మహిళా మండలి ఉపాధ్యక్షురాలు ఎస్ లక్ష్మీనర్సు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి రజియ, మహిళా సమాఖ్య నాయకురాలు అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల ప్రజా పాలన.. తెలంగాణ ప్రగతికి కొత్త దిశ!

### సంక్షేమం నుంచి ప్రపంచస్థాయి అభివృద్ధి వైపు రాష్ట్రం

### డీసీసీ కార్యదర్శి కె. వినయ్ ముదిరాజ్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 7 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో తెలంగాణను సంక్షేమం, సామాజిక న్యాయం, వ్యవసాయం, విద్య, వైద్యం, ఉద్యోగాలు, పెట్టుబడులు, మౌలిక వసతులు, సాంకేతిక అభివృద్ధి రంగాల్లో ముందుకు తీసుకెళ్తోందని మేడ్చల్ జిల్లా డీసీసీ కార్యదర్శి కె. వినయ్ ముదిరాజ్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలను కేంద్రంగా చేసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణ భవిష్యత్తుకు బలమైన పునాది పడుతోందని ఆయన తెలిపారు.

**రైతు సంక్షేమానికి పెద్దపీట**

రైతు కుటుంబాలకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా ద్వారా భారీగా పెట్టుబడి సాయం, సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని వినయ్ ముదిరాజ్ తెలిపారు. వ్యవసాయం, రైతు సంక్షేమానికి సుమారు రూ. 1.68 లక్షల కోట్లను కేటాయించడంతో పాటు 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వివరించారు.

**మహిళా సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యం**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా కోట్లాది ప్రయాణాలు జరిగాయని, మహిళా కుటుంబాలకు ఉచిత విద్యుత్, రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. మహిళా సంఘాలకు భారీగా బ్యాంకు రుణాలు అందించి వారిని ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.

**పేదలకు ఆహార భద్రత.. సామాజిక భరోసా**



కొత్తగా 15 లక్షలకు పైగా రేషన్ కార్డులు మంజూరు చేయడం, కోట్లాది మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార భద్రత కల్పించడం, రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సన్నబియ్యం అందించడం వంటి చర్యలు పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని చెప్పారు. కొత్తగా పెన్షన్లు మంజూరు చేసి సామాజిక భద్రతను మరింత బలోపేతం చేశామని తెలిపారు.

**ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల**

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా మొదటి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని, అర్హులైన కుటుంబాలకు ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో లక్ష బహుళ అంతస్తుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించడం ప్రభుత్వానికి పేదల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

**సామాజిక న్యాయానికి చారిత్రాత్మక నిర్ణయాలు**

రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర కుల, సామాజిక-ఆర్థిక సర్వే నిర్వహించడం, ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం నిర్ణయం తీసుకోవడం వంటి చర్యలు సామాజిక న్యాయానికి కొత్త దిశ చూపుతున్నాయని వినయ్ ముదిరాజ్ పేర్కొన్నారు. కార్మికుల కనీస వేతనాల సవరణతో లక్షలాది మంది కార్మికులకు ప్రయోజనం కల్పించామని తెలిపారు.

**విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు**

ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి నియోజకవర్గంలో యువ భారత్ సమగ్ర గురుకుల పాఠశాలల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక పూర్వ విద్య, విద్యార్థులకు అల్పాహారం, పాలు, పోషకాహారం అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. భారీ ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి విద్యార్థులకు మెరుగైన విద్య అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

**యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన**

వెయ్యి రోజుల పాలనలో 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టామని, గ్రూప్-1 నుంచి ఉపాధ్యాయ నియామకాల వరకు కీలక నియామక ప్రక్రియలను పూర్తి చేశామని చెప్పారు. పోలీస్ శాఖలోనూ కొత్త పోస్టులకు నోటిఫికేషన్లు జారీ చేస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించేందుకు పారిశ్రామిక శిక్షణ సంస్థలు, పాలిటెక్నిక్ కళాశాలలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.

**తెలంగాణ రైజింగ్ -- 2047 లక్ష్యం**

తెలంగాణను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వినయ్ ముదిరాజ్ తెలిపారు. దేశంలోనే తొలి నెట్-జీరో స్మార్ట్ సిటీ లక్ష్యంతో భారత్ ఫ్యూచర్ సిటీ, కృత్రిమ మేధ నగరం, డేటా కేంద్రాలు, ప్రాంతీయ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, నైపుణ్య విశ్వవిద్యాలయం, క్రీడా విశ్వవిద్యాలయం వంటి ప్రాజెక్టులు తెలంగాణ భవిష్యత్తుకు కొత్త రూపాన్ని ఇవ్వనున్నాయని అన్నారు. ఇది కేవలం వెయ్యి రోజుల పాలన కాదు. తెలంగాణ భవిష్యత్తుకు వేసిన బలమైన పునాది. ప్రజల కోసం.. ప్రజలతో కలిసి.. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయంతో తెలంగాణను ప్రపంచస్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది" అని మేడ్చల్ జిల్లా డీసీసీ కార్యదర్శి కె. వినయ్ ముదిరాజ్ పేర్కొన్నారు.



## పునరావృత ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం చూపాలి


### తక్కువ పనితీరు ప్రాంతాలపై 15, 30 రోజుల లక్ష్యాలతో ప్రత్యేక కార్యాచరణ:జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 7(ప్రభాత ఉదయం)**

జలమండలి పరిధిలో తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, కలుషితనీటి ఫిర్యాదులు, క్షేత్రస్థాయి పనితీరు, సిబ్బంది- యంత్రాల వినియోగం, ఆదాయ సమీకరణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో జేఎండీ మయాంక్ మిట్టల్ కలిసి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి రీజనల్ ల ఈడీలు,ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయి తనిఖీలు, సీవరేజ్ ఓవర్ ఫ్లో, కలుషితనీటిఫిర్యాదులు, నీటి సరఫరా లేని ప్రాంతాలు, జలాశయాల నీటిమట్టాలు, పెండింగ్ ఫిర్యాదులు, సిబ్బంది పనితీరు, యంత్రాల వినియోగం, ఆదాయ వృద్ధి తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించారు.ఒకే ప్రాంతంలో ఒకే సమస్యపై ఫిర్యాదులు పదేపదే వస్తుంటే, ప్రతిసారి తాత్కాలికంగా పరిష్కరించి క్లోజ్ చేయకుండా, వాటి మూల కారణాన్ని గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని ఎండీ స్పష్టం చేశారు. ఫిర్యాదును పరిష్కరించడం మాత్రమే లక్ష్యం కాదు.. అదే ఫిర్యాదు మళ్లీ రాకుండా చూడడమే అసలైన లక్ష్యం.. అనే దృక్పథంతో అధికారులు పనిచేయాలని సూచించారు.అత్యధికంగా, పునరావృతంగా ఫిర్యాదులు నమోదవుతున్న ప్రాంతాలను గణాంకాల ఆధారంగా గుర్తించి, ప్రతి మేనేజర్ తన పరిధిలో సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. తక్కువ పనితీరు ఉన్న ప్రాంతాల్లో 15 రోజులు, 30 రోజుల స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకుని కొలిచేలా ఫలితాలు సాధించాలని తెలిపారు. మంచి పనితీరు ఉన్న ప్రాంతాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేయాలని సూచించారు.తమ ప్రాంత విస్తీర్ణం, కనెక్షన్ల సంఖ్య, పైపుల వ్యవస్థ పొడవు, ఫిర్యాదుల తీవ్రత, స్థానిక పరిస్థితుల ఆధారంగా సిబ్బంది, లైన్‌మెన్లు, లైన్ మేనేజర్లు, యంత్రాల అవసరాలను హేతుబద్ధీకరించాలని తెలిపారు. ఇరుకైన వీధులు, ప్రత్యేక మురుగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాలకు అనువైన యంత్రాలను వినియోగించాలని, యంత్రాలను కేవలం అందుబాటులో ఉంచడం కాకుండా వాటి వాస్తవ వినియోగం, పూర్తయిన పనులు, తగ్గిన ఫిర్యాదుల ఆధారంగా సమీక్షించాలని ఆదేశించారు.ఫిర్యాదుల గణాంకాలు, ప్రాజెక్టుల వివరాలు, రహదారి పనుల సమాచారాన్ని సమన్వయం చేసి సమస్యాత్మక ప్రాంతాలను శాస్త్రీయంగా గుర్తించాలని సూచించారు. ప్రజావాణి సహా అన్ని మార్గాల్లో వచ్చే ఫిర్యాదులను ఏంసీసీకి.. ఒకే పర్యవేక్షణ వ్యవస్థలోకి తీసుకువచ్చి, వాటి పరిష్కార స్థితిని సమగ్ర సమాచార పట్టిక ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.ఒకవేళ వచ్చే నెలలో ఆశించిన మేర వర్షాలు కురవని పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, సింగూరు జలాశయంలోని నీటి నిల్వలు, సరఫరా పరిస్థితిపై ముందస్తు అంచనా రూపొందించాలని ఎండీ అధికారులను ఆదేశించారు. జలమండలి ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ఆదాయ సమీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జేఎండీ ఆదేశించారు. వాణిజ్య, గృహ వినియోగ వర్గీకరణ, నీటి మీటర్లు, బిల్లుల డిమాండ్, వసూళు ,, నమోదు కాని కనెక్షన్లు తదితర అంశాలను గణాంకాల ఆధారంగా విశ్లేషించి ఆదాయ నష్టాలను అరికట్టాలని సూచించారు. రాబోయే నాలుగు నెలల్లో ఆదాయాన్ని 20 శాతం పెంచే లక్ష్యంతో, ప్రతి నెల పురోగతిని సమీక్షించాలని తెలిపారు.ఈ సమావేశంలో సైబరాబాద్ ఈడీ పంకజ, మల్కాజిగిరి ఈడీ సంతోష్, ఆపరేషన్ డైరెక్టర్లు నారాయణ, ప్రభు, సత్యనారాయణ, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలుమేనేజర్లు, ఐటీ ట్రాన్స్మిషన్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## ఉమిత్యాలలో కోతుల బెడదను నివారించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7(ప్రభాత ఉదయం)**



కేటిదొడ్డి మండలం ఉమిత్యాల గ్రామంలో కోతుల బెడద రోజు రోజుకి శృతిమించిపోతుంది. కోతులు పంట చేలను నాశనం చేయడమే కాకుండా ఇళ్లలోకి జొరబడి ఏది దొరికితే అది ఎత్తుకెళ్లుతున్నాయని, అదిలించబోతే మీదపడి కరుస్తున్నాయని, పెద్దలు పిల్లలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరి పై దాడులు చేస్తూ గాయాలకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే చాలా మందిని కోతులు గాయపరచాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు విన్నవించుకున్న పాలక సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. కోతుల బెడద తీవ్రతను గతంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కరించలేదని, ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం, అధికారులు స్పందించి కోతుల నుండి రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అధికారులు మారిన మారని డీటీఓ కార్యాలయంలో మారని వసూళ్ల పర్వం

### ఆర్టీఓ ఆఫీస్ లో ఆయనే కలెక్షన్ కింగ్

**గద్వాల జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్7(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని డీటీఓ కార్యాలయంలో వసూళ్ల పర్వం యధేచ్ఛగా కొనసాగుతోంది. అధికారుల ఎన్ని ఆరోపణలు వచ్చిన, ఏసిబి అధికారులకు ఫిర్యాదు చేసిన వి డోంట్ కేర్ అని బహిరంగానే అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నారని డీటిఓ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఆరోపించడం ఇప్పుడు హాట్ టాఫిక్ గా మారింది.

**డీటీఓ ఆఫీసులో ఆ వ్యక్తే కీలకం**

గద్వాల్ జిల్లా డీటీఓ కార్యాలయంలో కొనసాగుతూ వసూళ్లు చేయడంలో ఒక ప్రైవేటు వ్యక్తి ఆరితేరాడంటా. ఇంకేముంది జిల్లా రవాణా శాఖ అధికారి ఎవరు వచ్చిన ఆయన ను కలెక్షన్ కింగ్ గా అయననే నియమించుకోవడం, అవినీతికి సంబంధించిన వసూళ్ళ బాధ్యత మొత్తం ఆయనకు అప్పగించడమే ఆనవాయితీగా సాగుతోంది. డిటిఓ కార్యాలయానికి అనుసంధానంగా ఏర్పాటు చేసుకున్న ఏజెంట్స్ కన్సల్టెన్సీ నుంచి రావాల్సిన అక్రమ డబ్బులు మొత్తం ఒక ప్రైవేట్ వ్యక్తి అప్పగించినట్లు, ఆయన ప్రతి రోజు వసూలు అయిన అక్రమ సొమ్మునంత అధికారులకు అప్పగిస్తున్నాడని ఏజెంట్లు ఆరోపిస్తున్నారు. బ్రోకర్లు వాహనారుల నుంచి అక్రమంగా వసూళ్లు చేసిన ఫైసల్ ఒక్కో ఫైల్ కు ఒక్కోరేటు అని వసూళ్ల చేసి అధికారులకు అప్పజెప్పడం ఆయన బాధ్యత. అధికారుల అవినీతిపై ఏసీబీ అధికారులకు సమావారం ఇచ్చిన బ్రోకర్ల సమాచారం గోప్యంగా ఉంచాల్సిన ఏసిబి అధికారులు పూర్తి సమాచారం అధికారులకు చేరవేస్తున్నారంటా. మేము అవినీతి అధికారుల భరతం పడుతారని సమాచారం ఇస్తే వారు మా సమాచారాని లీక్ చేసి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాదిత బ్రోకర్లు ఆరోపిస్తున్నారు. ఇది ఇలాఉంటే ఇన్నేండ్ల నుంచి లేని వసూళ్లను ఇప్పుడు మీడియా ముందుకు తెస్తున్న ఏజెంట్లు ఇన్నాళ్లు ఎక్కడ ఉన్నారని వాహనాదారుకు ఆరోపిస్తున్నారు. కమీషన్ లు మిగలక నా లేక... ఆన్ లైన్ వచ్చి గిరాకీలు వస్తలేవా అని అధికారులపై ఆరోపణలు చేస్తున్నారా అనే కోణంలో ఆలోచించాల్సిందే బాస్

## హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7(ప్రభాత ఉదయం)**




కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బాసు హన్మంతు నాయుడు ఆరోపించారు.కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై సోమవారం కేటిదొడ్డి మండలం తహసీల్దార్ కార్యలయం ముందు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కరుణాకర్ బీఆర్ఎస్ బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా బాసు హన్మంతు నాయుడు మాట్లాడుతూ...రైతుల పంట పొలాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్తును అందజేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో నిరంతరం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విమర్శించారు. వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభం, నీటిపారుదల సమస్యలు, విద్యుత్ సమస్యలు, యూరియా కొరత, రైతు బీమా తదితర సమస్యలపై రైతు సదస్సులు నిర్వహిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు.ఆరు గ్యారంటీల పేరుతో నిలువునా మోసం చేశారని విమర్శించారు. యూరియా యాప్ తో రైతుల కష్టాలు రెట్టింపయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్ ఎస్ తరపున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.రాఘవేంద్ర రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సోమశేఖర్ రెడ్డి, చక్రధర్ రెడ్డి, మున్నూర్ వీరారెడ్డి, గాజుల కృష్ణారెడ్డి, నక్క రవి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మైలార్ దేవుపల్లి విద్యుత్ సెక్షన్‌లో సరఫరా అంతరాయం

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 7 (ప్రభాత ఉదయం)**

మైలార్ దేవుపల్లి విద్యుత్తు సెక్షన్ పరిధిలో వివిధ మరల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి గ్రామ ఫీడర్‌లో 11 కె.వి ఏబి కేబుల్ వేయడం కోసం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు మొఘల్ కాలనీ, ఎండి పల్లి గ్రామం, ప్రగతి కాలనీ, బృహదావన్ కాలనీ, టాటా నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



బార్లు పబ్ ల యాజమాన్యాలతో సమావేశం మాట్లాడుతున్న సీపీ ఇతర అధికారులు..

## సైబరాబాద్‌లో నిబంధనలు దాటితే కఠిన చర్యలు: సీపీ డా. ఎం. రమేష్

### హోటళ్లు, బార్లు, పబ్‌ల యాజమాన్యాలతో సమీక్షా సమావేశం

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 7,(ప్రభాత ఉదయం)**

వ్యాపార సంస్థలు చట్టబద్ధంగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే తమ కార్యకలాపాలను నిర్వహించాలని లైసెన్సులు లేకుండా నడిపే సంస్థలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ స్పష్టం చేశారు. సైబరాబాద్ సీపీ కార్యాలయం లోని ఆడిటోరియంలో హోటల్స్, బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్స్, హుక్కా సెంటర్ల యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిబంధనలు పాటిస్తూ వ్యాపారాలు చేసుకునే వారికి సైబరాబాద్ పోలీసులు పూర్తి సహకారం అందిస్తారని ఉల్లంఘనలకు పాల్పడితే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి సంస్థ ఫైర్, సీఎంసీ, హెల్త్ ఆఫీసర్, టౌన్ ప్లానింగ్ ఎన్‌ఓసీలతో పాటు సీపీపీఎంఎస్ లైసెన్సులను సకాలంలో రెన్యువల్ చేసుకోవాలి.పబ్స్, బార్లలో నిర్ణీత సమయం దాటిన తర్వాత వ్యాపారాలు సాగించకూడదు. మైనర్లను లోపలికి అనుమతించడం కానీ పనిలో పెట్టుకోవడం కానీ తీవ్ర నేరం. సిబ్బంది వయస్సు, గుర్తింపు వివరాల కొరకు ఆధార్ ధృవీకరణ తప్పనిసరని సీపీ వివరించారు. రాజకీయ నాయకులు, ప్రముఖుల బంధువులమని చెప్పుకుని ప్రవర్తించే వారి పట్ల కఠినంగా ఉంటామని, చట్టం అందరికీ సమానమేనని స్పష్టం చేశారు.హుక్కాపై నిషేధం రాష్ట్రంలో హుక్కాపై నిషేధం ఉన్నందున, ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని 7 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ 2 లక్షల వరకు జరిమానా విధిస్తారని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ బార్లు, పబ్‌లలో గ్యాంగ్ వార్లకు తావులేకుండా చూడాలని, మాదకద్రవ్యాల నివారణకు పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు. లైసెన్సుల మంజూరులో వివిధ శాఖల మధ్య సమయ వ్యత్యాసాల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వ్యాపారులు సీపీ దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ సీ. హెచ్. శ్రీనివాస్ ఎస్‌ఓటీ డీసీపీ శోభన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ నూతన ఎస్ ఈ రవి ప్రసాద్‌ను సన్మానించిన టి.ఆర్.వి.కె.ఎస్ నాయకులు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 7(ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ నూతన ఎస్‌ఈ గా బాధ్యతలు స్వీకరించిన రవి ప్రసాద్ ను టి.ఆర్.వి.కె.ఎస్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం మెహిదీపట్నం లోని నానల్ నగర్ చౌరస్తా లో విద్యుత్ ఎస్ ఈ కార్యాలయంలో టి.ఆర్.వి.కె.ఎస్ రాజేంద్ర నగర్ సర్కిల్ నాయకులు , డివిజన్ నాయకులు రాజు సురేష్, రాములు ,ఉదయ్ కుమార్ ,జనకిరామ్, రవికుమార్ ,అశోక్, వినోద్ కుమార్,రాజేంద్ర నగర్ సర్కిల్ నాయకులు,డివిజన్ నాయకులు రాజు, సురేష్, రాములు, ఉదయ్ కుమార్, జానకిరామ్ ,రవికుమార్, అశోక్ ,వినోద్ కుమార్ లు ఎస్ ఈ రవి ప్రసాద్ ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.




## గ్రాండ్ పేరెంట్స్ డే, పోషకాహార వారోత్సవము

**కరీంనగర్, సెప్టెంబర్,7 (ప్రభాత ఉదయం)**

శ్రీ సరస్వతి శిశుమందిర్ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రాండ్ పేరెంట్స్ డే , న్యూట్రిషన్ వీక్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో కుటుంబ విలువలు, పెద్దల పట్ల గౌరవం, ఆరోగ్యం , పౌష్టికాహారం పట్ల అవగాహన పెంపొందించడమే కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. న్యూట్రిషన్ వీక్‌లో భాగంగా విద్యార్థులకు వివిధ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. నిన్న విద్యార్థులకు సి.బి.పి పరీక్షలు నిర్వహించగా, సోమవారం డాక్టర్ అనూష విద్యార్థులకు పౌష్టికాహారం ప్రాముఖ్యత, సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల గురించి వివరించారు.అదేవిధంగా గ్రాండ్ పేరెంట్స్ డే సందర్భంగా విద్యార్థుల తాత, నానమ్మ, అమ్మమ్మలను పాఠశాలకు ఆహ్వానించి, వారి గ్రాండ్ చిల్డ్రన్‌తో పాదసేవ చేయించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో తాతయ్య, నానమ్మల పట్ల ప్రేమ, గౌరవం , కృతజ్ఞతా భావాలను పెంపొందించే ప్రయత్నం చేశారు. లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు ఎర్రమరాజు సింగమ రాజు గ్రాండ్ పేరెంట్స్ కుటుంబంలో పోషించే కీలక పాత్ర, వారి అనుభవం, ఆప్యాయత మరియు మార్గదర్శకత్వం గురించి విద్యార్థులకు వివరించారు.గ్రాండ్ పేరెంట్స్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తరగతుల వారీగా ప్రథమ, ద్వితీయ బహుమతులను విజేతలకు అందజేశారు.ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ వివరించారు. పిల్లల వ్యక్తిత్వ వికాసంలో తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు అందించే ప్రేమ, అనుభవం, సంస్కారం ఎంతో విలువైనవని, అలాగే విద్యార్థుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 38వ వార్డు కార్పొరేటర్ దేవసాని సరస్వతీ సత్యం, 36వ వార్డు కార్పొరేటర్ కోడూరి చంద్ర హాజరయ్యారు.అతిథులుగా పాఠశాల సెక్రటరీ ఇంజనీర్ కోల అన్నారెడ్డి, సభ్యులు తణుకు మహేష్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మ్యాడమ్ శివకాంత్ (సాగర్ కలర్ లాబ్) , బట్టు వినోద్, మెతుకు కృష్ణ చైతన్య, అయిత సూరజ్, ఆచార్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.కుటుంబ పెద్దల పట్ల గౌరవం, ఆరోగ్యకరమైన జీవనశైలి, పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసేలా ఈ కార్యక్రమాలు ఆద్యంతం ఉత్సాహంగా కొనసాగాయి.

ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక



## బొల్లారం డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోరుతూ బీఆర్ఎస్ నేతల విజ్ఞాపన

**పటాన్, సెప్టెంబర్ 7 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చినప్పటికీ, 100 రోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పి 1000 రోజులు పూర్తయినా ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు కాలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో బొల్లారం డివిజన్ 272 బీఆర్ఎస్ పార్టీ తరఫున జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్లు వి.హనుమంత్ రెడ్డి, బి.జైపాల్ రెడ్డి, టి.సాయికిరణ్ రెడ్డి, వి.బీరప్ప యాదవ్, మన్నె సతీష్ ముదిరాజ్, వి.శ్రీకాంత్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు అరూర్ రత్నం, మునీర్, ఆర్.నాయుడు, మైనారిటీ ప్రెసిడెంట్ ఖాసీం, బీసీ ప్రెసిడెంట్ శ్రీశైలం, ఎస్సీ ప్రెసిడెంట్ శ్రీనివాస్, శ్రీనివాసులు తదితరులు సోమవారం అమీన్‌పూర్ సర్కిల్ జిహెచ్ఎంసీ కార్యాలయంలో డిప్యూటీ కమీషనర్ డి.ప్రదీప్ కుమార్‌కు విజ్ఞాపన పత్రం అందజేశారు. విజ్ఞాపనలో వారు ఆడపిల్లలకు మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 ఆర్థిక సహాయం, తులం బంగారం, స్కూటీ అందించాలని, ఆడబిడ్డలకు రక్షణ కల్పించాలని కోరారు. రైతన్నలందరికి ప్రతి పంటకు రైతు భరోసా, కొరత లేకుండా ఎరువుల పంపిణీ, పంటలకు బోనస్, 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ అందించాలని, రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12,000 సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని, అర్హులైన నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, ఉద్యోగం, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని, విద్యార్థులకు విద్యా భరోసా, పెండింగ్ ఫీజు బకాయిలు చెల్లించాలని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు పెంచిన రూ.4,000 పింఛన్ అందించాలని, ఆటో అన్నలకు ఏడాదికి రూ.12,000 సహాయం చేయాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిపై భగ్గుమన్న బీఆర్ఎస్

**పటాన్‌చెరు జాతీయ రహదారిపై బైఠాయించి భారీ నిరసన ధర్నా**

**మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసుల తీరు సిగ్గుచేటని నేతల ఆగ్రహం**

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 7, (ప్రభాత ఉదయం)**



అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన అమానుష వైఖరికి నిరసనగా పటాన్‌చెరులో నిరసన జ్వాలలు మిన్నంటాయి. పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పిలుపుమేరకు నియోజకవర్గ కేంద్రంలోని జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున నిరసన ధర్నా నిర్వహించారు. రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా బీఆర్ఎస్ మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు అత్యంత హేయమని, ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, రాజ్యాంగబద్ధంగా నిరసన తెలుపుతూ నల్ల దుస్తులు ధరించి శాసనసభకు వెళ్లడం నేరమా అని వారు ప్రశ్నించారు. ప్రతిపక్ష గొంతు నొక్కేందుకు పోలీసులను అడ్డం పెట్టుకుని అక్రమ అరెస్టులకు పాల్పడటం కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజలకు ఇచ్చిన హామీలను అసెంబ్లీ వేదికగా ఎండగడతారనే భయంతోనే ప్రభుత్వం ఇలాంటి దమనకాండకు పాల్పడుతోందని విమర్శించారు.రాష్ట్రంలో కొనసాగుతున్న నియంతృత్వ పాలనను, పోలీసుల దుందుడుకు వైఖరిని ప్రజలంతా నిశితంగా గమనిస్తున్నారని..సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీకి ప్రజలే గట్టి బుద్ధి చెప్పడం ఖాయమని వారు హెచ్చరించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని, ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ముఖ్య ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట - చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 7 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. రామడుగు మండలం దేశరాజుపల్లి లో రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ బిల్డింగ్ రూ.4.16 లక్షలతో విశ్వబ్రాహ్మణ సంఘం భవనం రామడుగు మండల కేంద్రంలో రూ.50 లక్షలతో మహిళా సమైక్య భవనం రూ.24 లక్షలతో నిర్మిస్తున్న ఈఆర్వో భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పన ప్రభుత్వం కట్టుబడి ఉందని రోడ్ల అభివృద్ధి చేసి రవాణా సౌకర్యాలు మెరుగుపరుస్తామని తెలిపారు,ఈ కార్యక్రమల్లో ఎంపీడీవో రాజేశ్వరి ,తహసిల్దార్ రాజమల్లయ్య,ఏఎంసి చైర్మన్ తిరుమల , గంగాధర ఏఎంసి మాజీ చైర్మన్లు ఎ. లచ్చయ్య, అంజనీ ప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జవ్వాజి హరీశ్ , సింగల్ విండో చైర్మన్ కోల రమేష్ సర్పంచులు తదితరులుపాల్గొన్నారు.

## త్వరలో కొండగట్టుకు సీఎం రేవంత్ రెడ్డి

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 7 (ప్రభాత ఉదయం)**

ఎండోమెంట్ నిధులతో కొండగట్టులో నిర్మించనున్న రూ.50 లక్షల వాహన పూజ షెడ్ కు భుమి పూజ చేసిన అనతరం పాత్రికేయులతో మాట్లాడుతూకొండగట్టు మాస్టర్ ప్లాన్ పనులు త్వరలో ప్రారంభిస్తామని నవంబర్ నేలలో స్వామివారికి చందనోత్సవం నిర్వహించనున్నామని,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తున్నామని, ఎమ్మెల్యేమేడిపల్లి సత్యం తెలిపారు.



## ఎవరకీ పట్టని ట్రాఫిక్ సమస్య: గద్వాల్లో వినాయక చవితి 'ఆగమనం' రచ్చ!

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7(ప్రభాత ఉదయం)**

గణేశ్ నవరాత్రోత్సవాల వేళ గద్వాల్ పట్టణంలో ట్రాఫిక్ నిర్వహణ పూర్తిగా పడకేసిందని వాహనదారులు, స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వినాయక విగ్రహాలను మండపాలకు తరలించే 'గణేశ్ ఆగమనం' వేడుకల పేరుతో జరుగుతున్న హంగామా వల్ల పట్టణంలో ట్రాఫిక్ స్తంభించిపోయి ప్రజలకు విసుకు తెస్తోంది.

**సాంప్రదాయం పక్కకు.. షో సోషల్ మీడియా రీల్స్ మోజు!**

గతంలో గణనాథుని విగ్రహాలను మేళతాళాలు, భజన కీర్తనలతో మంగళకరమైన వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో మండపాలకు తీసుకువచ్చేవారు. కానీ ఈ ఏడాది 'ఆగమనం' పేరిట విపరీత పోకడలు పెరిగిపోయాయి. ట్రాలీలపై భారీ డీజే సౌండ్ బాక్సులు, కళ్లు బైర్లు కమ్మే లేజర్ లైట్లతో యువత హల్‌చల్ చేస్తోంది. కేవలం ఆర్భాటం, సోషల్ మీడియా రీల్స్ మోజు, విచ్చలవిడి పోటీతత్వంతో రోడ్లపై ఊరేగింపులు నిర్వహిస్తూ సాధారణ ప్రయాణికులకు తీవ్ర నరకం చూపిస్తున్నారు.

**నిబంధనలు గాలికి.. అధికారుల నిర్లక్ష్యం?**

గణపతి నవరాత్రుల సందర్భంగా డీజేలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి (పర్మిషన్) తీసుకోవాలని అధికారులు చెబుతున్నప్పటికీ, కొందరు నిర్వాహకులు ఎలాంటి అనుమతులు లేకుండానే భారీ శబ్దాలతో డీజేలను ఏర్పాటు చేసి, ఆగమన వేడుకలను నిర్వహించడంపై ఆరోపణలు వస్తున్నాయి.


కనీస ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా, రోడ్లను పూర్తిగా మూసివేస్తూ వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నా పోలీసులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

## ప్రజావాణి ఆర్జీలను సకాలంలో పరిష్కరించాలి

**ప్రజావాణికి మొత్తం 34 దరఖాస్తులు.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7(ప్రభాత ఉదయం)**



ప్రజావాణికి వచ్చే ఆర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ వారం మొత్తం 34 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. జిల్లా స్థాయి ప్రజావాణిలో 98, మండల స్థాయి ప్రజావాణికి వచ్చిన 247 ఆర్జీలు పెండింగ్ లో ఉన్నాయని వీటన్నింటిని ఆయా శాఖల అధికారులు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రజావాణికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, చీఫ్ సెక్రటరీ స్థాయిలో కూడా రివ్యూ చేస్తుండడంతో అలసత్వం వహించడం సరికాదన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, ఎస్ఈ, డిఈ, ఏడిఈ, ఏఈ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలన్నారు. పలు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయంతో రైతులు ఇబ్బందులు పడుతున్న ఘటనలు ఇటీవల ఎక్కువగా చోటు చేసుకోవడంతో సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉంటూ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మంజుల, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గద్వాలలో ఆర్టీఓ అధికారుల ఇష్టారాజ్యం

**ఎల్ఇడి లైట్లున్నాయని ఫైన్**

**డిపార్ట్మెంట్ వాహనాలకు ఎల్ఇడిలైట్లు లేవా**

**వాళ్లు చేస్తే న్యాయం... మేము చేస్తే వ్యభిచారమా అంటూ ప్రశ్నించాడు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7(ప్రభాత ఉదయం)**

గద్వాల రవాణ శాఖ అధికారుల తీరుపై వాహనదారులు మండిపడుతున్నారు. గద్వాలలో వాహనాలు తనిఖీ చేసిన ఆర్టీఓ అధికారులు ఒక లారీకి ఎల్ఈడి లైట్లు ఉన్నాయని రూ.5వేల వరకు చలాన్ విధించారని వాహనదారులు ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇన్సురెన్స్, ఆర్సీ, లైఫ్ టాక్సీ, డ్రైవింగ్ లైసెన్స్ అన్ని రకాల పేపర్లు ఉన్నా చిన్న సాకుతో డ్రైవర్ సెల్ ఫోన్ లాకొని వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. సెల్ ఫోన్ లాక్కొనాల్సిన అవసరం వారికిఎక్కడ ఉందని ఈ వీడియోలో వాహనదారుడు ప్రశ్నించాడు.

## పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చడమే ఇందిరమ్మ ఆశయం..గుర్రం రణధీర్ రెడ్డి

**శంషాబాద్,సెప్టెంబర్07(ప్రభాత ఉదయం)**



పేదవాడి సొంత ఇంటి కల నిజం చేయాలనె ఇందిరమ్మ ఆశయాశీ నెరవేర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిన్న గోల్కొండ సింగిల్ విండో మాజీ చైర్మన్ గుర్రం రణధీర్ రెడ్డి పేర్కొన్నారు.పెద్ద తూప్రా తండా గ్రామానికి చెందిన వడ్తే శైలజ రామునాయక్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి రణధీర్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు గణేష్ నాయక్,తో కలిసి హాజరయ్యారు. గృహప్రవేశం చేస్తున్న దంపతులకు నూతన వస్త్రాలను బహుకరించారు.రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ఐదు లక్షలకు మరికొంత మొత్తాన్ని జతచేసి ఇంటిని అందంగా బొమ్మరిల్లు మాదిరిగా నిర్మించుకున్న శైలజ రామునాయక్ లను వారుఅభినందించారు.దేశంలో సొంత ఇల్లు లేని వారు ఉండకూడదని ప్రతి ఒక్కరికి పక్కా నివాస గృహం ఉండాలనేది ఇందిరమ్మ ఆశయమని రణధీర్ రెడ్డి తెలిపారు.ఇందిరమ్మ ఆశయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెరవేరుస్తున్నారని అన్నారు.




## 420 అడుగుల 'బాకీ కార్డు'తో బీఆర్ఎస్ భారీ నిరసన

**22ఏ జాబితాలో ఆస్తుల చేర్పుపై ఆగ్రహం.. ప్రజా భూముల విక్రయంపై ప్రభుత్వాన్ని నిలదీత**

**కేపీహెచ్‌బీలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం**

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 7 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కేపీహెచ్‌బీ డివిజన్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచనల మేరకు కేపీహెచ్‌బీ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు, బాలాజీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పగడాల శిరీష బాబురావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్ నుంచి మూడో ఫేజ్‌లోని జయశంకర్ విగ్రహం వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 420 అడుగుల పొడవైన 'బాకీ కార్డు'ను ప్రదర్శిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జయశంకర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.

**22ఏ జాబితాపై తీవ్ర ఆగ్రహం**

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కేపీహెచ్‌బీ డివిజన్‌లోని వసంత్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజల ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చి యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు అనుభవిస్తున్న ఆస్తులపై అనిశ్చితి నెలకొనడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అదేవిధంగా ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములను కోట్లాది రూపాయలకు విక్రయించడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాలకు కేటాయించాల్సిన భూములను కాపాడాల్సిన ప్రభుత్వం వాటిని విక్రయించడం సరికాదని విమర్శించారు.

**హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం**

ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఇచ్చిన హామీల అమలుకు బదులుగా ఇప్పటికే అమల్లో ఉన్న సంక్షేమ కార్యక్రమాలకు కూడా ఆటంకాలు కల్పించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయని, ఆర్థిక ఇబ్బందులతో సామాన్య ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. "ప్రజల ఆస్తుల పరిరక్షణ, ప్రజా భూముల రక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం. ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది" అని నాయకులు తెలిపారు.

ఈ నిరసన కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ సమన్వయకర్త రెడ్డి సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు కృష్ణారెడ్డి, ప్రభాకర్‌గౌడ్, వెంకటేష్, రాజేష్‌రాయ్, సీనియర్ నాయకులు శ్యామల రాజు, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, కే. పవన్‌కుమార్, హరినాథ్, సురేష్‌రెడ్డి,మధుసూదన్‌రెడ్డి, శివారెడ్డి, కంచరపల్లి నాగరాజు, సుభాష్‌గౌడ్, రమణ,రాంబాబునాయుడు, కచిన్ టైలర్, వలవల నాయుడు, శ్రీనివాసరెడ్డి, తులసిరెడ్డి, పాతూరి గోపి, సాయి శ్రీనివాస్, రావెల్ షా, మోజేష్, దినేష్, రవిసింగ్ తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకులు అనిత, శ్రీపాద, అరుణశెట్టి, లక్ష్మీరాజ్యం, ధనలక్ష్మి, హేమ, సుబ్బలక్ష్మి, లక్ష్మి, ఉష, లలిత, స్వప్న, సావిత్రి, ప్రేమలత తదితరులు పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి..

**అసెంబ్లీ ముట్టడించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి**

**ఫీజుల బకాయిలపై బీజేపీ పోరుబాట**

**రాజేంద్రనగర్,సెప్టెంబర్07(ప్రభాత ఉదయం)**



విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పిలుపు మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టారు.రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ.1,500కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన మహాధర్నాకు ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని నాయకులు ఆరోపించారు.పేద,మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఎంతోమంది విద్యార్థుల ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎంతో కీలకమని,నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో విద్యార్థులు,వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థుల చదువులు కొనసాగించేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని,కళాశాలల యాజమాన్యాల నుంచి కూడా విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎలాంటి ఆలస్యం చేయకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రజల తరఫున,విద్యార్థుల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును ప్రభుత్వం గౌరవించాలని అన్నారు.ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుంటే నిరసనలకు అనుమతులు నిరాకరించడం సరికాదని విమర్శించారు.విద్యార్థుల హక్కుల కోసం,ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల కోసం బీజేపీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.అసెంబ్లీ ముట్టడి సందర్భంగా పోలీసులు తోకల శ్రీనివాస్‌రెడ్డిని అసెంబ్లీ ప్రాంగణంలో అరెస్టు చేసి సికింద్రాబాద్‌లోని గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విద్యార్థుల సమస్య పరిష్కారమయ్యే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని బీజేపీ నాయకులు తెలిపారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జి.పాండు యాదవ్,అడికే జనార్ధన్,సంతు గౌడ్,మధుసూదన్‌రెడ్డి, మన్మోహన్‌రెడ్డి,తలారి చిన్న,అమర్‌రెడ్డి,మాగాణి శివ,పవన్‌సాయి,హర్షవర్ధన్,లంకల సాయిశంకర్‌రెడ్డితో పాటు బీజేపీ,యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608